# వా'కింగ్'




'మనిషి మనిషిగా బతకాలంటే తపన, తాపత్రయం ఉండాలి' అంటాడు మా బంగార్రాజు. అంతే కాదు, పెట్టిన చేతినీ, పుట్టిన ఊరినీ సదా గుర్తుంచుకోవాలి అని కూడా అంటాడు.

ఎవరికైనా పరిచయం కానంతవరకూ అతను మామూలు మనిషే. ఆ కాస్త అడ్డూ తొలగి పరిచయం అయిందీ అంటే... ఆ తరువాత ఇట్టే కలిసిపోతాడు. ఇక మనసులోని మనిషిగా తిష్ఠ వేసుక్కూచుంటాడు. ఎవరు ఏ కష్టంలో ఉన్నా నేనున్నానంటూ ముందుగా ముందుకొచ్చే మొట్టమొదటి వ్యక్తి బంగార్రాజే.

అన్నట్లు బంగార్రాజెవరో చెప్పనే లేదు కదూ! నిజం చెప్పాలంటే అతని గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. నాకే కాదు ఎవరికీ అర్థంకాని ఓ క్రాస్ వర్డ్ పజిల్ బంగార్రాజు.

అతను ఎవరో ఎక్కడనుంచి వచ్చాడో, అసలెప్పుడు వచ్చాడో ఎవరికీ తెలీదు. అతను చేస్తున్నది సామాన్యమైన నౌకరీ. ఓ షాపులో గుమస్తా కమ్ పనివాడు కమ్ పెద్దమనిషి. షాపులో క్షణానికో అవతారం దాలుస్తూ అందరినీ ఆకట్టుకుంటూ ఉంటాడు.

చేస్తున్న వృత్తి పట్ల గౌరవం, అంకితభావం ఉండాలి-అనే మనస్తత్వం కలిగినవాడు. ఆ సూత్రాన్ని తు.చ. తప్పకుండా పాటించే వ్యక్తికూడా. మంచితనం అతనికి ఆత్మబంధువు అయితే, నీతినిజాయితీలు అతని తోబుట్టువులు.

**పోతుబరి నారాయణరావు**

కేడర్‌లో తక్కువే అయినా కేరక్టర్‌లో చాలామంది కంటే పెద్దవాడు. చదివింది మామూలు చదువే. కాని ఆవకాయ దగ్గర నుంచి అత్తింటి ఆరళ్ల వరకూ క్షుణ్ణంగా మాట్లాడుతాడు. ఏ విషయం మాట్లాడినా ఎంతో కొంత హాస్యాన్ని జోడించి నలుగురినీ ఆకట్టుకోవటం అతని ప్రత్యేకత.

శంకరం, బంగార్రాజు పని చేసే షాపు ఓనరు. అతనికి బంగార్రాజంటే వల్లమాలిన అభిమానం. అందుక్కారణం ముఖ్యంగా ఇద్దరూ ఒక ఈడువారే. శంకరానికి అతని తండ్రి వ్యాపారబాధ్యతలు అప్పగించిన రోజుల్లోనే బంగార్రాజు వచ్చి పనిలో చేరాడు. అప్పటికి అంతంత మాత్రంగా ఉన్న వ్యాపారం వారి వయసులాగే అభివృద్ధి చెందింది.

వ్యాపారరీత్యా బంగార్రాజు ఊరూరు తిరిగి సరకు కొనే దగ్గర కొనుగోలు చేసి, అవసరం అనుకున్న చోట బదలాయించి, ఇంకా అవసరమైతే గోడౌన్లలో భద్రపరచి, లావాదేవీలన్నీ చక్కబెట్టి సాయంత్రానికి పైసలతో సహా లెక్కలు అప్పగించేవాడు. కాగితాల మీద కూడికలు, కొట్టివేతలతో అవస్థలు పెట్టే లెక్కల్ని నోటిమాటతోనే చెప్పటం బంగార్రాజు ప్రత్యేకత. వేనకువేల రూపాయలు బంగార్రాజు చేతుల్లో పెట్టేసి తను మాత్రం నిశ్చింతగా కేష్‌బాక్స్ ముందు కూర్చునేవాడు శంకరం.

అవసరాన్ని అర్థంచేసుకొని శంకరమే అంతో ఇంతో డబ్బు బంగార్రాజు చేతిలో పెట్టేవాడు. కాని తనకిది కావాలని బంగార్రాజు ఏ నాడూ పెదవి కదపలేదు.

చుట్టుపక్కల వ్యాపారస్తులు ఎవరు ఎన్నివిధాలుగా ప్రలోభపెట్టినా ఏనాడూ తలవంచలేదు బంగార్రాజు. శంకరం కూడా అంతే. బంగార్రాజు గురించి ఎవరు చెడుగా చెప్పినా ఓ నవ్వు నవ్వేసి ముఖం పక్కకు తిప్పేసేవాడు. శంకరానికి బంగార్రాజు నమ్మిన బంటు. బంగార్రాజుకు శంకరం దాతా, దైవం, అన్నీను. శంకరం తన మీదపెట్టిన నమ్మకాన్ని నీతినిజాయితీలతో బేరీజువేసి మరీ అప్పగించేవాడు బంగార్రాజు. బంగార్రాజు అడుగు పెట్టిన తరువాత వ్యాపారం ఒకటికి రెండింతలు అయిందన్నది శంకరం నమ్మకం.

అంతటి మంచి ఫలాలను, ఫలితాలను అందిస్తున్న ఈ అపురూపమైన చెట్టు తనువు తన వాకిట్లోనే తెల్లారి పోకూడదు. బంగార్రాజుకు ఏదో చెయ్యాలి, ఏదో చెయ్యాలి-అనుకునేవాడు శంకరం.

అసలు బంగార్రాజు నాకెలా పరిచయం అయ్యాడంటే-

నేను ఉద్యోగంలోంచి రిటైరు కావటానికి కాస్త ముందుగానే నా శేషజీవితంలో భాగం పంచుకొని, తోడుగా, నీడగా ఉంటానంటూ 'షుగర్' నన్ను ఆశ్రయించింది. డాక్టరుగారు ఏవో మందులు రాశారు. రోజూ ఉదయాన్నే వాకింగ్ చేయమని సజెస్టు చేశారు.

ఉద్యోగంలో ఉంటూ వాకింగ్ సాధ్యం కాలేదు. రిటైరైన మరుసటినెల నుంచే వాకింగ్ ప్రారంభించాను.

మొదట్లో బెరుకుగా, ఏదోలా ఉండేది. వేకువనే లేవటం, తయారవటం చిరాకుగా ఉండేది. తెలిసినవారు తెలియనివారు ఎవరెవరో ఎదురవుతూ ఉండేవారు. మొదట్లో అందరూ వింతగా చూస్తున్నట్లుగా తోచేది. ఓ పది, పదిహేను రోజులు పట్టుదలగా వాకింగ్ చేశాను. చూస్తే 'షుగర్' కాస్త తగ్గింది. శరీరంలో ఏదో కొత్తదనం కనిపించింది. హాయిగా ఉంది.

ఇంకేం....? మనసైనవాడే మొగుడు- మంచి చేసేదే మందు అన్నట్లుగా వాకింగ్ కొనసాగించాను.

రోజూ ఉదయాన్నే ఊరికి ఓ రెండు మూడు కిలోమీటర్ల వరకూ వెళ్లిరావటం. ఏ వాహనాల కాలుష్యాలకూ అందని చోటు. రోడ్డుకు ఇరువైపులా పచ్చని పంటపొలాలు. స్వచ్ఛమైన గాలితెరలు. ఆ ప్రశాంత వాతావరణంలో ఆ గాలికి ప్రాణాలు లేచి వచ్చినట్లనిపించేది.

ఒక రోజు వాకింగ్‌లో తనకు తానుగా పరిచయం చేసుకొన్నాడు బంగార్రాజు. కూడా ఎవరెవరో ఉన్నారు. తరువాతతెలిసింది వారంతా వాకర్సేనని. కొద్దిరోజుల్లోనే దగ్గరయ్యాడు. తరువాత రోజుకో వాకర్‌ని పరిచయం చేశాడు. అలా అందరితోనూ పరిచయాలేర్పడ్డాయి. అలా పరిచయమైన వారిలో చాలామంది ఏవో శరీరరుగ్మతలతో బాధపడినవారే. అందులో బ్లడ్ ప్రెషర్ ఎక్కువగా ఉన్నవారూ తక్కువగా ఉన్నవారూ, కీళ్లనొప్పులవారూ. ఎక్కువగా 'షుగర్' పలుకరించినవారూ ఉన్నారు. అలా వారంతా రెగ్యులర్ వాకర్స్‌గా మారటానికి కారకుడు బంగార్రాజే.

ఏది ఏమైనా వాకర్స్ అందరి ఆరోగ్యాలూ కాస్త మెరుగయ్యాయి.

రోజూ తొలి కోడికూతతో మేల్కొని పొలం పనులకు వెళ్లేవారి ఆరోగ్యరహస్యం అర్థమైంది.

అప్పటికి చాలా కాలం నుంచి బంగార్రాజు రెగ్యులర్ వాకర్. క్రమం తప్పకుండా రోజూ సుమారు ఓ నాలుగైదు కిలోమీటర్లు ఉదయాన్నే నడిచి వస్తుంటాడు. వాకింగ్ అతనికి ఆరోప్రాణం. అతని రోజువారీ కార్యక్రమాల్లో మొట్టమొదటిది. ఎవరు అడిగినా, అడక్కపోయినా పరిచయం అయిన రెండు మూడు రోజుల్లోనే తను వాకింగ్ ప్రారంభించటానికి కారణాన్ని ఓ కథగా చెపుతాడు.

అప్పుడెప్పుడో ఒంట్లో నలతగా, నీరసంగా ఉంటే డాక్టరుగారిని సంప్రదించాడట. అన్ని పరీక్షలూ చేసి చివరకు 'షుగర్' అని తేల్చేశారట డాక్టరుగారు.

"ఇది ఎలా పోతుంది డాక్టరుగారూ?" అమాయకంగా అడిగాడు బంగార్రాజు.

డాక్టరుగారు ఎగాదిగా చూసి ఓ నీరసపు నవ్వు నవ్వేశారట. "షుగర్ వ్యాధి ఒకసారి ప్రవేశిస్తే పూర్తిగా నయంకావటం అనేది ...అప్పుడే" అని చెప్పారట డాక్టరుగారు శూన్యంలోకి చూస్తూ.

ఆ మాటకు అర్థం అప్పటికప్పుడే తెలీకపోయినా తరువాత తెలిసిందట. డాక్టరు గారు కూడా షుగర్ పేషెంటేనని.

డాక్టరు చెప్పిన ఆ 'అప్పుడే' అనే మాటను చిత్రంగా



నొక్కి హావభావప్రదర్శనలతో చెప్పి అందర్నీ నవ్విస్తుంటాడు బంగార్రాజు.

తరువాత ఏవో మందులు రాసి రోజూ క్రమం తప్పకుండా మార్నింగ్‌వాక్ చేయమనీ, అలా చేస్తే షుగర్‌ని కాస్త నియంత్రించవచ్చనీ చెప్పారట డాక్టరుగారు. అదిగో, అలా ప్రారంభం అయింది బంగార్రాజు వాకింగ్.

ఓ నెలరోజుల తరువాత చూస్తే షుగర్ లెవెల్ తగ్గింది. శరీరం కాస్త తేలిక అయింది. కొత్త ఉత్సాహం కనిపించింది. అలుపెరుగని పనిలో, ప్రయాణాల్లో కనిపించిన కీళ్లనొప్పులు మటుమాయం అయ్యాయి. అంతే. రోజులు వారాలుగా, వారాలు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా మారాయి. కాని బంగార్రాజు దినచర్యలో మాత్రం మార్పు రాలేదు. గాలొచ్చినా, వానొచ్చినా, గాలీ-వానా కలిసివచ్చినా అతని వాకింగ్‌లో మార్పురాలేదు. అతను ఓ రెగ్యులర్ వాకర్.

ఎంతటి రెగ్యులర్ వాకర్ అంటే ఆ మధ్య మోటారు సైకిలు మీద తిరిగివస్తుండగా ఓ ఎడ్లబండితో పోటీపడ్డాడు. ఎడ్లు బెదిరాయి. మోటారు సైకిలు రోడ్డు విడిచి పక్కనే ఉన్న పంటపొలాల్లో పల్టీ కొట్టింది. మోకాలిమీద గాయం అయింది. డాక్టరు గారు కట్టుకట్టి నాల్రోజులు విశ్రాంతి తీసుకోమన్నారు. విషయం తెలిసి అందరం చూడ్డానికి వెళ్లాం. ఇంట్లో వాళ్లకు ధైర్యం చెప్పి ఓ నాలుగు రోజులు కదలకుండా కట్టి పడేయమన్నాం.

మరుసటి దినం 'ఎలా ఉన్నాడో'నని చూడ్డానికి బయలుదేరాం. మధ్యలోనే తెలిసింది. ఉదయం వాకింగ్ కొంతదూరం వరకూ చేసి తిరిగి వచ్చి ఏదో ఊరు వెళ్లాడని, అంతగా వాకింగ్ బంగార్రాజు జీవితంలో ఓ భాగం అయిపోయింది.

తరువాత ఎందరెందరో వాకర్స్‌గా మారేరు. అందుకు చాలావరకు కారణం బంగార్రాజే. ఒకసారి ఎవరైనా కొత్తగా పరిచయం అయితే అలా మాటల్లోకి దింపి వాకింగ్ వలన కలిగే లాభాలను ఏకరువు పెట్టేస్తాడు. నెమ్మదిగా అవతలి వ్యక్తిచేత 'సరే' అనిపిస్తాడు. ఆ తరువాత వేకువనే ఆ వ్యక్తి ఇంటి ముందు తయారైపోతాడు. ఎవరెన్ని చిరాకులూ, పరాకులూ ప్రదర్శించినా చిన్నబోడు. అవతలి వ్యక్తిని వాకింగ్‌కు బయలుదేరించి తీరుతాడు.

వాకింగ్‌కు రోజూ వచ్చేవారి సంఖ్యపెరిగింది. వాకర్స్ క్లబ్ రూపు దిద్దుకుంది. క్లబ్ ప్రారంభోత్సవం నాడు బంగార్రాజు హడావుడి అంతా ఇంతా కాదు. కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో బంగార్రాజు మాత్రం సామాన్యసభ్యుడే.

ఆడుతూ, పాడుతూ ఓ సంవత్సరం గడిచింది. వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం జరుపుకుంది. అందులో బంగార్రాజుకు 'బెస్ట్ వాకర్' అవార్డు లభించింది. మరుసటి దినం ఆ వార్తను ప్రత్యేకంగా బాక్సులు కట్టి ప్రచురించాయి దినపత్రికలు. బంగార్రాజు ఆనందం అంతా ఇంతా కాదు.

రోజూ ఉదయం జోకులతో, నవ్వులతో సరదాగా సందడిగా గడచేది మా వాకింగ్. ఆ కాస్సేపు అందరం అన్నీ మరచిపోయేవాళ్లం.

సవ్యంగా, సాఫీగా సాగిపోతే అది జీవితమే కాదు. సెలయేరులా ఎన్నో మలుపులు తిరగాలి. ఎన్నెన్నో ఎత్తుపల్లాలను దాటాలి.

ఓ రోజు బంగార్రాజు అందరి మధ్యా చిత్రమైన వార్తచెప్పాడు. తను మరుసటి దినం నుంచి వాకింగ్‌కు రావటం లేదు అని ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే మనిషి ఆ రోజు గంభీరంగా ఉన్నాడు. అప్పటికప్పుడే అందరి దగ్గరా సెలవు తీసుకొని వెనుతిరిగాడు.

అందరం ఆశ్చర్యపోయాం. బంగార్రాజు వాకింగ్ మానేస్తున్నాడంటే నమ్మలేక పోయాం. కారణం ఎవరికీ అంతు చిక్కలేదు.

మరుసటి దినం బంగార్రాజు వాకింగ్‌కు రాలేదు. వస్తాడని చాలాసేపు ఎదురుచూశాం. వాకబు చేస్తే బంగార్రాజు ఊరువిడిచి పెట్టి ఎక్కడికో వెళ్లి పోయాడని మాత్రం తెలిసింది.

ఇదంతా జరిగి చాలాకాలం అయింది. బంగార్రాజు కారణంగా ఏర్పడిన వెలితి మాకు వెలితిగానే మిగిలిపోయింది.

ఆ రోజు దినపత్రికలో-

అక్కడెక్కడో ఓ ఊర్లో వాకర్స్ క్లబ్ వార్షికోత్సవవార్త వేశారు. ఆ కార్యక్రమంలో 'బెస్ట్‌వాకర్' అవార్డు అందుకుంటూ బంగార్రాజు ఫోటో. క్రమం తప్పకుండా సంవత్సరం పొడవునా వాకింగ్ చేసిన ప్రముఖవ్యాపారస్తుడు బంగార్రాజు అనే వార్త కూడా వేశారు. అంటే అంటే బంగార్రాజు ఇప్పుడు ప్రముఖవ్యాపారస్తుడు. అందరం సంతోషించాం.

బంగార్రాజు నీతినిజాయితీలను ఎవరూ శంకించలేదు. కాని మామూలు మనిషి ఉన్నట్టుండి ప్రముఖవ్యాపారి ఎలా అయ్యాడో ఎవరికీ అంతుచిక్కటం లేదు.

ఎందుకో బంగార్రాజు పనిచేసిన షాపు ఓనరు శంకరాన్ని చూడాలనిపించింది. వెళ్లేను.

శంకరం షాపులోనే ఉన్నాడు. ఎదురుగా ఆ రోజు దినపత్రిక పరిచి ఉంది. అందులో 'బెస్టు వాకర్ బంగార్రాజు' ఫోటో. శంకరం ముఖం వెలిగిపోతోంది.

"బంగార్రాజు నిజంగా బంగారమే. మేలిమి బంగారం. వాడి చేతిలో మట్టిపోసినా బంగారమే అవుతుంది" అన్నాడు నన్ను చూసి.

శంకరం మాటల్లో విషయం చూచాయగా అర్థమైంది.

ఆ క్షణాన శంకరం ఎత్తుగా చాలా ఎత్తుగా కనిపించాడు.

బంగార్రాజు జీవితంలోనూ 'బెస్ట్‌వాకరే' అనుకున్నాను తృప్తిగా. ■

